క్లుప్తంగా

మురికి కూపంగా నగరం



చెత్త కుప్పను పరిశీలిస్తున్న పీపీఎస్ఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వ హయాంలో కర్నూలు చెత్త నగరంగా మారుతోందని పట్టణ పౌర సంక్షేమ సంఘం (పీపీఎస్ఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ.పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పీపీఎస్ఎస్ నాయకులు వెంకట రమణ కాలనీలో పర్యటించారు. వారి పర్యటనలో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు కనిపించాయి. వాటి ద్వారా దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వారి ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు ఆయన వివరించారు. పారిశుద్ధ్యం లోపించినా మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు టి.శివారెడ్డి, ఆర్.చంద్రశేఖర్, కాడప్ప, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట



శరీన్‌నగర్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్‌లో ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ

కర్నూలు సిటీ: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జగన్నాథగట్టుపై ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్‌ఐటీడీఎం)లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో క్రైడో ది స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు శనివారం ఆ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కార్తీక్ కుమార్, ప్రిన్సిపాల్‌శ్రావ్య లక్ష్మీ పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరించుకోండి

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ గృహ వినియోగదారులు స్వచ్ఛంద అదనపు లోడు క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ పర్యవేక్షక ఇంజినీరు ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులు చెల్లించవలసిన అభివృద్ధి రుసుములో 50 శాతం స్వచ్ఛందంగా చెల్లించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం మార్చి 31 నుంచి జులై 30వ తేదీ వరకు అమలులో ఉంటుందని ఆలోపు రుసుము చెల్లించాలని సూచించారు. ఈ పథకం ద్వారా కిలో వాట్‌కు రూ.వెయ్యి లాభం చేకూరుతుందని వెల్లడించారు.

హ్యాపీ ఎగ్జామ్స్ పోస్టర్ విడుదల

కర్నూలు సిటీ: పరీక్షలకు ఉపయోగపడే పలు సూచనలు, టిప్స్‌తో తయారు చేసిన హ్యాపీ ఎగ్జామ్స్ పోస్టర్‌ను శనివారం ఫస్ట్ స్టెప్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో ఆ సంస్థ చైర్మన్ రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు మొదలుకానున్నాయని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పోస్టర్స్ ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. పదో తరగతి తరువాత ఉన్నత చదువులు, వాటి వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై సైతం అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.

మహిళకు అరుదైన చికిత్స



కోలుకున్న మహిళతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌లో క్యాన్సర్ బాధిత మహిళకు అరుదైన వైద్యం అందించి డాక్టర్లు ప్రాణం పోశారు. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లాకు చెందిన 43 ఏళ్ల మహిళ గతేడాది అక్టోబర్‌లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి రాగా గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ పి.అబ్దుల్ సమద్ పరీక్షించి ఈసోఫాగస్‌లో నియోప్లాస్టిక్ గ్రోత్ (క్యాన్సర్ పెరుగుదల) ఉన్నట్లు గుర్తించారు. ఫ్లోరోస్కోపీ ద్వారా ఎన్‌జె ట్యూబ్ అమర్చి క్యాన్సర్ కారణంగా ఏర్పడిన ఫిస్టులాను బైపాస్ చేశారు. దీంతో ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో కీమోథెరపీ, రేడియోథెరపీ సూచించారు. మూడు నెలల పాటు ఈ చికిత్సలు మరో ఆసుపత్రిలో చేయించుకున్న అనంతరం గత నెల 12న తిరిగి మెడికవర్ హాస్పిటల్‌లో చేరింది. ఆ తర్వాత మెరుగైన చికిత్స అందించడంతో కోలుకున్నట్లు హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి తెలిపారు.

కూటమి బడ్జెట్ అంతా గ్రాఫిక్సే !

- బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి నిధులేవీ ?
- ఆడబిడ్డ నిధి, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఊసే లేదు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి



కర్నూలు (టౌన్): అబద్ధాలకు పేటెంట్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని మరోసారి రుజువైందని, వార్షిక బడ్జెట్‌లో ప్రజలను దగా చేసి గ్రాఫిక్స్ బడ్జెట్ ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి దుయ్యబట్టారు. ఆయన శనివారం స్థానిక సీతారామ నగర్‌లోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చిన కూటమి సర్కారు వాటి అమలుకు నిధులు కేటాయించలేదన్నారు. మూడు పార్టీలు కలిసి సూపర్ సిక్స్‌పై ఆర్భాటంగా ప్రచారం చేశారని, చివరకు పథకాలు అమలుచేయలేక చేతులెత్తేశారని విమర్శించారు. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అప్పటివరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు బడ్జెట్‌లో నయాపైసా విదల్చలేదన్నారు. ఇది నిరుద్యోగులను మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి నామమాత్రంగా నిధులు కేటాయించారన్నారు. ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడం దారుణమన్నారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి మొండి చేయి చూపారని, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం హామీ ఏమైందన్నారు. ఆలూరు నియోజకవర్గంలో జింకల పార్కు, ఆదోని, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పార్కుల ఏర్పాటు హామీలను పూర్తిగా విస్మరించారన్నారు. పారిశ్రామికీకరణ జరిగితేనే ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని, ఓర్వకల్ హబ్ అభివృద్ధికి నిధులు ఎక్కడ అని ప్రశ్నించారు. జిల్లాలో మిర్చి రైతన్నలకు భరోసాగా కర్నూలులో మిర్చి క్లస్టర్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం రైతన్నలకు భరోసా కల్పించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. జిల్లాలో సాగు చేస్తున్న మిర్చి, వేరుశనగ, పత్తి, టమాటా పంటలకు మద్దతు ధర ఇచ్చే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు కల్పించలేదన్నారు. ఎన్నో ఆశలతో ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు.

అంకెల గారడీ

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెలు తప్పా కేటాయింపులు లేవని కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.జిలానీ బాషా విమర్శించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌ను గొప్పలు చెప్పుకోవడానికి రూ.3.22 లక్షల కోట్లకు పెంచారని, ఇందులో ఏ వర్గానికి న్యాయం చేసేలా కేటాయింపులు లేవన్నారు. అన్నదాత సుఖీభవ, అమ్మకు వందనం పథకాలకు కూడా పూర్తిస్థాయిలో కేటాయింపులు లేవన్నారు. రూ.300 కోట్లతో గిట్టుబాటు ధరల కోసం స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయడం పూర్తిగా అన్యాయమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లేదని, ఆడబిడ్డ నిధి ఏమైందని ప్రశ్నించారు. రాయలసీమ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులకు ఒక్కపైసా నిధులు విదల్చలేదని, ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో నిరుద్యోగ భృతికి కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. 9నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని చెప్పారు. నాయకులు సాంబశివుడు, బజారన్న, సుంకన్న, ప్రమీళ, అనంతరత్నం, లాజరస్ పాల్గొన్నారు.

హామీలు విస్మరించి మోసం

- అన్ని వర్గాలను నిరాశపరిచిన బడ్జెట్
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ వెల్లడి



కర్నూలు (టౌన్): కూటమి నాయకులు ఎన్నికల సమయంలో అలవిగాని హామీలతో అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి నట్టేట ముంచారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుబాష్ చంద్రబోస్ విమర్శించారు. ఆయన శనివారం స్థానిక సి.క్యాంపులోని కార్యాలయంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో హామీల అమలుకు నిధులెక్కడ అని ప్రశ్నించారు. మోసపూరిత బడ్జెట్‌పై మహిళలు, రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, కూలీలు ఇలా.. అన్ని వర్గాల వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలన్నీ నేరవేరుస్తామని చెప్పి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు? హామీలు అమలు చేయడం చేతగాకపోతే పదవి నుంచి తప్పుకోవాలన్నారు. కరోనా సమయంలోనూ ప్రతి ఇంటికీ సంక్షేమం అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగనన్నకే సాధ్యమైందని గుర్తు చేశారు.

జగనన్న నామస్మరణ చేయడం విడ్డూరం

వార్షిక బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నామస్మరణ చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. హామీలు అమలు చేయడం చేతగాక మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై నిందలు మోపడం కూటమి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. మోసపూరిత ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం



పాతబస్తీలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

కర్నూలు (టౌన్): పార్టీ కోసం పనిచేసే వారిని గుర్తించి పదవులు అప్పగించాం. అదే స్ఫూర్తితో పార్టీని బలోపేతం చేద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పాతబస్తీలోని 5వ వార్డులో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నీలకంఠ (కంటూ) ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎస్వీ కేక్ కట్ చేశారు. కంటూతో పాటు శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్వీకి శాలువాలు కప్పి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. ప్రతి వార్డులో వైఎస్సార్‌సీపీకి బలమైన క్యాడర్ ఉందన్నారు. ప్రజల కోసం నిత్యం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఆనాడు జగనన్న చెప్పిన ప్రతి హామీని అమలు చేసి ఇంటింటికీ సంక్షేమాన్ని అమలు చేశారన్నారు. అయితే ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అలివిగాని హామీలు ఇచ్చి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ప్రజలను మోసం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రత్యేక కార్యక్రమాలు



ఆపద సమయంలో హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కర్నూలు: మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో మహిళల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా పీఎస్ డీఎస్పీ శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో పోలీసులు, ఐసీడీఎస్, ఇతర శాఖల అధికారులతో కలిసి మహిళల భద్రత, హక్కులు, సాధికారతపై శనివారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో మెడికల్ క్యాంప్, ఓపెన్ హౌస్‌ను సందర్శించిన మహిళలు, విద్యార్థులకు పోలీసు అధికారులు స్టేషన్లలో జరిగే విధులు, మహిళా సహాయక కేంద్రం పట్ల అవగాహన, పోలీసుల పనితీరు, వాడే పరికరాలు, రికార్డుల నిర్వహణ తదితర విషయాలను వివరించారు. మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు–వాటి ప్రభావం, సైబర్ క్రైం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారులు, అత్యవసర సమయంలో సహాయం కొరకు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, పోలీస్ హెల్ప్‌లైన్ 100, 112, సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930, పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 77778 77722కు ఫోన్ చేసి పోలీసు సహాయం పొందవచ్చన్నారు.

పశుగణనలో అంకెల గారడీ తగదు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కర్నూలు(అగ్రికల్చర్): పశుగణనలో అంకెల గారడీని ప్రోత్సహిస్తుండటం ఆందోళన కలిగించే విషయమని నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని గోకులం సమావేశ భవనంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20వ పశుగణనతో పోలిస్తే 21వ పశుగణనలో పాడి సంఖ్య ఎక్కువ చూపాలని సిబ్బందిపై ఒత్తిడి తెస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పశువుల సంఖ్య తగ్గినప్పటికి పరిగణలోకి తీసుకోకుండా ఎక్కువగా నమోదు చేయాలని ఆదేశాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. అంకెల గారడీ చేయడం వల్ల లైవ్‌స్టాక్ సెన్సెస్‌లో కచ్చితత్వం ఉండదన్నారు. పారా సిబ్బంది సంఘాల నేతలు రంగన్న, జనార్దన్ రెడ్డి, రాముడు, చంద్రయాదవ్, గంగా, బజారి, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'మాలలను విమర్శించే అర్హత ఎమ్మార్పీఎస్‌కు లేదు'

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డు కులాల వర్గీకరణ అంశానికి సంబంధించి మాలలను విమర్శించే అర్హత ఎమ్మార్పీఎస్ నేతలకు లేదని పీవీ రావు మాల మహానాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవ స్వామి, చెన్నకేశవులు అన్నారు. ఫిబ్రవరి 23న కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన మాలల యుద్ధ గర్జన సభపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని వారు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది ఆగస్టు 1న ఆరుగురితో కూడిన జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం ఆయా రాష్ట్రాల జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పు అనంతరం మందకృష్ణ మాదిగ మాలలపై విష ప్రచారం చేస్తూ ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. తాము ఎల్లప్పుడు ఆయనకు శ్రేయోభిలాషులుగా ఉంటామని, రెచ్చగొట్టడం, రెచ్చిపోవడం తమ పద్ధతి కాదన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): నగరంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో మునిసిపల్ అధికారులతో సమావేశం అయ్యారు. నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రగతి ప్రణాళికలు రూపొందించాలన్నారు. శంఖుస్థాపన చేసిన పనులను గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని 52 వార్డుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని, ఎప్పటికప్పుడు చెత్తను సేకరించాలని, దోమలు, వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న మంత్రి

కర్నూలు (టౌన్): నగరంలో శనివారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రారంభమైంది. స్థానిక బంగారుపేటలో మంత్రి టీజీ భరత్ పింఛన్దారులకు సొమ్ము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ 1వ తేదీనే పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో మొదటి రోజు 35,358 పెన్షన్లకు గాను 34,191 మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. అందుబాటులోని 1,177 మందికి సోమవారం సాయంత్రంకల్లా పింఛన్లను పంపిణీ చేసి వంద శాతం పూర్తి చేస్తామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 3న కలెక్టరేట్, 6న చలో విజయవాడ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. శనివారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించడం లేదన్నారు. ఇటీవల కేబినెట్ సమావేశంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్ పరిధి నుంచి తప్పిస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో ఏజెన్సీలకు కార్మికుల జీతాల అంశాన్ని అప్పజెప్పరాదన్నారు. నేరుగా మునిసిపల్ కార్పొరేషన్ లేదా మునిసిపాలిటీలే వేతనాలు చెల్లించాలన్నారు. నాయకులు చంద్రశేఖర్,ఈశ్వర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందించాలి

కర్నూలు(సెంట్రల్): సి.బెళగల్ మండలం పోలకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్న సమయంలో చెట్టు విరిగిపడి ఏడుగురు విద్యార్థులకు గాయాలు కావడం బాధాకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా పేర్కొన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ..గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలి

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో మార్చి15వ తేదీన నిర్వహించే రైతు సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం పిలుపునిచ్చారు. శనివారం సీఆర్ భవన్‌లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 15,16 తేదీల్లో తమిళనాడులో నిర్వహించే రైతు సంఘం జాతీయ మహాసభల విజయవంతం కోసం కర్నూలులో 5 వేల మందితో రైతు సదస్సును నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు జాతీయ నాయకులు రావులవెంకయ్య, పి.రామచంద్రయ్య హాజరవుతున్నట్లు వెల్లడించారు.

కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలి

కర్నూలు కల్చరల్: కామన్ పీజీ సెట్‌ను తక్షణమే రద్దు చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం రాయలసీమ యూనివర్సిటీలో జీఓ నంబర్ 77ను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్‌కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, పలువురు విద్యార్థి సంఘాల నాయకులు నాగార్జున, రామకృష్ణ, శ్రీనివాసులు, రాజీవ్, రామరాజు పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని, ఏపీలో కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టేందుకు విద్యార్థి, యువజన సంఘాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు అశోక్, ఈశ్వర్, సందీప్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

5న చలో విజయవాడ

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 5వ తేదీన చలో విజయవాడకు పిలుపునిచ్చినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు తెలిపారు. శనివారం స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చలో విజయవాడకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

కర్నూలు: ఎక్సైజ్ అధికారుల తనిఖీలో అక్రమ మద్యం పట్టుబడింది. కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ ఆధ్వర్యంలో ఎస్ఐలు నవీన్, రెహనా బేగం తమ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి శనివారం వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. కల్లూరు మండలం దొడ్డిపాడుకు చెందిన పకీర్ దస్తగిరి నుంచి 12 కర్ణాటక మద్యం బాటిళ్లు, అలాగే కర్నూలు శ్యామల నగర్‌లోని వెంకటరామయ్య ఇంట్లో 10 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే బుధవారపేటలో నాటుసారా స్థావరాలపై తనిఖీలు నిర్వహించి.. సారా వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 5వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు సీఐ చంద్రహాస్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్ కార్డుతో పాటు ధరావత్ సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాల్సిందిగా సూచించారు.

అ'పూర్వ' కలయిక



పూర్వ విద్యార్థులతో క్లస్టర్ వర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, తదితరులు

కర్నూలు సిటీ: డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో 1971 నుంచి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం నిర్వహించారు. క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. డిగ్రీ కాలేజీ ఆవరణలో నిర్మించిన రూసా భవనాలకు కాలేజీ వ్యవస్థాపక సభ్యులు పేలాల కొండయ్య పేరు, హాస్టల్‌కు ఆయన సతీమణి పేరు పెడతామని హామీ ఇచ్చారు. రిజిస్ట్రార్ డా.కె వెంకటేశ్వర్లు, కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వై.జయరాజ్ మాట్లాడుతూ.. ఎంతో మంది మేధావులను తయారు చేసిన కాలేజీ రుణం తీర్చుకోవడం ప్రతి విద్యార్థికి లభించిన గొప్ప అవకాశమన్నారు. ప్రిన్సిపాల్ ఎం.ఇందిరాశాంతి, కె.జి.మల్లికార్జున రావు, పేలాల ప్రేమ్‌కుమార్, శివ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5న రంగనాథస్వామి కల్యాణోత్సవం



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గోదా గోకులం సభ్యులు

కర్నూలు కల్చరల్: శ్రీరంగనాథ స్వామి దేవాలయం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 5వ తేదీన శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త పేర్కొన్నారు. ఆయన శనివారం బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో ఆదివారం నుంచి 8వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు.రోజూ ఉదయం 6.30 నుంచి 12.30 గంటలు, సాయంత్రం 5.30 నుంచి 9 గంటల వరకు వేడుకలు జరుగుతాయన్నారు.

ఎక్సైజ్‌లో పదోన్నతులు కల్పించాలి

కర్నూలు: ఎక్సైజ్ శాఖ ఫోర్త్ జోన్ పరిధిలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లకు ఎస్ఐలుగా అడ్‌హాక్ పదోన్నతులు కల్పించి ఖాళీ ఎస్ఐ పోస్టులను భర్తీ చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బీసీ ఓబులేసు, సభ్యులు మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖలో 20 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తూ ప్రమోషన్లు లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పదవీ విరమణ గడువు సమీపిస్తున్నందున పదోన్నతి కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

సీనియారిటీ జాబితాను తయారు చేయించండి

ఫోర్త్ జోన్ పరిధిలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించేందుకు సీనియారిటీ జాబితా 2012 నుంచి ఇప్పటివరకు రూపొందించలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో ఐదు సంవత్సరాలకే కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తున్నారని, ఫలితంగా కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న వారికి అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ విషయంలో అవకతవకలను సరిచేయించి కానిస్టేబుళ్లకు పదోన్నతి కల్పించేందుకు సీనియారిటీ జాబితాను రూపొందించాలని కోరారు.

గాయపడిన విద్యార్థినికి పరామర్శ



విద్యార్థిని శ్రీలేఖను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(హాస్పిటల్): సి.బెళగల్ మండలం పోలకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తుండగా చెట్టు విరిగి పడడంతో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల్లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శ్రీలేఖను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పరామర్శించారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆసుపత్రికి వెళ్లి బాలిక ఆరోగ్య పరిస్థితిని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. విద్యార్థిని శ్రీలేఖ ఆరోగ్య పరిస్థితి శుక్రవారం సాయంత్రం విషమించడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. రాత్రంతా ప్రత్యేక శ్రద్ధతో వైద్యం అందించడంతో బాలిక శనివారం ఉదయానికి కాస్త కోలుకుంది. బాలికకు రక్తం తగ్గడంతో అవసరమైన మేర బాటిళ్లతో ఎక్కించారు. పల్స్, ఆక్సిజన్ లెవల్స్ సాధారణ స్థితికి వచ్చినట్లు వైద్యులు తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, వైద్యులు ఉన్నారు.

నోటీస్ బోర్డు

నేడు వార్షికోత్సవం

కర్నూలు కల్చరల్: అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహం 31వ వార్షికోత్సవాన్ని ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఓల్డ్‌సిటీ చిదంబరావు వీధిలోని స్వామి వివేకానంద సంస్కృత పాఠశాలలో నిర్వహించనున్నట్లు వసతి గృహం అధ్యక్షుడు చిరంజీవిరెడ్డి, కార్యదర్శి బాలాజీరావు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా జడ్జి జి.కబర్థి హాజరవుతారని పేర్కొన్నారు. హైదరాబాద్ ఆర్ఎస్ఎస్ క్షేత్ర సేవా ప్రముఖ్ చంద్రశేఖర్ హాజరై సందేశమిస్తారని తెలిపారు.

విద్యుత్ కోతలు..

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ శేషాద్రి శనివారం ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సింధు ఎస్టేట్, మారుతి మెగా సిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మీ నగర్, కేంద్రీయ విద్యాలయం, చెక్ పోస్ట్, బీడీ కార్మికుల కాలనీ, కళావతి నగర్, వాసవీ నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు.

ఆర్ఎస్ఎస్ నగర సమావేశం

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నగర సాంఘిక్‌ను ఆదివారం ఉదయం 7 గంటలకు ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి తెలిపారు. ప్రముఖ వ్యాపారస్తులు జి.ఎస్.మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రాంత కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ పుట్టా శేషు ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తారని వెల్లడించారు.